క్లుప్తంగా

పలు ప్రాంతాల్లో ఫాగింగ్



శ్రీరామ్ నగర్‌లో ఫాగింగ్ చేయిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌లో భాగంగా నగరంలో సీజనల్ వ్యాధులు రాకుండా మలేరియా విభాగం ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో దోమల నివారణ కార్యక్రమం చేపట్టినట్టు నగరపాలక సంస్థ వైద్య అధికారి మాలతి తెలిపారు. ఈ మేరకు స్థానిక 4వ డివిజన్‌లోని శ్రీరామనగర్ స్కూల్ రోడ్డు, మారుతి నగర్, నాగేంద్ర కాలనీ తదితర ప్రాంతాల్లో దోమల లార్వా నిర్మూలనకు స్ప్రేయింగ్, మురుగు కాలువ కల్వర్టు కింద ఫాగింగ్, ఖాళీ స్థలాల్లో ఉన్న నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్ వేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో జి.సురేష్ కుమార్, మలేరియా ఇన్‌స్పెక్టర్ దత్తి వేణుగోపాల్ స్వామి, శానిటరి ఇన్‌స్పెక్టర్ బోను రాజు, ఆరోగ్య కార్యదర్శి, ఆశా కార్యకర్తలు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

1 నుంచి సభ్యత్వ నమోదు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వచ్చే నెల 1వ తేదీ నుంచి తలపెట్టిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతా రామాంజనేయ చౌదరి పిలుపునిచ్చారు. ఏలూరు జిల్లా బీజేపీ కార్యాలయంలో జిల్లా బీజేపీ కోర్ కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు చౌటపల్లి విక్రమ్ కిషోర్ అధ్యక్షతన సోమవారం సాయంత్రం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా గారపాటి చౌదరి, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పాల్గొన్నారు. జిల్లా సభ్యత్వ ప్రముఖ్‌గా శరణాల మాలతి రాణి, మరో ముగ్గురిని సహ ప్రముఖ్‌గా నియమించినట్లు తెలిపారు. ఈనెల 22న ఏలూరులో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహిస్తామని విక్రమ కిషోర్ తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి నరేంద్ర ప్రకాష్, రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు బి.నిర్మల కిషోర్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

ఏలూరు టౌన్: అప్పు చెల్లించాలని అడిగితే కులం పేరుతో దూషించిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఏలూరు నగర శివారు చొదిమెళ్ల సుంకరవారితోటకు చెందిన అరుగుల ఉషారాణి వద్ద పెదవేగి మండలం వంగూరుకు చెందిన గొట్టాపు శ్రీనివాస్ దఫదఫాలుగా కొంత సొమ్ము అప్పు తీసుకున్నారు. డబ్బులు బాకీ చెల్లించకపోవటంతో ఉషారాణి గట్టిగా అడిగింది. త్వరగా డబ్బులు చెల్లించాలని కోరింది. దీంతో శ్రీనివాస్, అతని భార్య శిరీషా, శ్రీనివాస్ తండ్రి సుబ్బారావు ఉషారాణిని కులం పేరుతో దూషించారు. తమ కులం వాళ్ల వద్ద అప్పు తీసుకోకూడదని ఎగతాళి చేశారు. ఈ క్రమంలో బాధితురాలు వీరిపై ఏలూరు రూరల్ పోలీసు స్టేషన్ ఫిర్యాదు చేయటంతో సీఐ రాజశేఖర్ ఆదేశాల మేరకు ఎస్సై రాజారెడ్డి సోమవారం రాత్రి ముగ్గురి పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చదువుల్లో ముందుండాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ పద్మావతి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పిల్లలు చదువుల్లో ముందుండేలా ప్రతి తల్లీ ప్రోత్సహించాలని ఐసీడీఎస్ పీడీ కేపీఎల్ పద్మావతి సూచించారు. మిషన్ వాత్సల్య లబ్ధిదారులతో సోమవారం నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పిల్లలకు వచ్చిన డబ్బులను వాని చదువులకే వినియోగించాలని సూచించారు. డీసీపీఓ సూర్యచక్రవేణి మాట్లాడుతూ పిల్లలందరూ ఉన్నత చదువులు చదవాలన్నారు. సీడీపీఓ ఎ.పద్మావతి మాట్లాడుతూ పిల్లల అభిరుచులను, వారు భవిష్యత్‌లో ఏం కావాలనుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. సూపర్‌వైజర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యుత్, ఆస్తి పన్ను సమస్యలపై వినతి



కలెక్టర్ వెట్రిసెల్వికి వినతిపత్రం ఇస్తున్న రవిప్రకాష్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఎస్సీ, ఎస్టీ, బీసీ బడుగు బలహీన వర్గాల వారు విద్యుత్ కనెక్షన్లు పొందాలంటే విద్యుత్ శాఖ అధికారులు కఠిన నిబంధనలతో తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవి ప్రకాష్ సోమవారం కలెక్టర్ వెట్రిసెల్వికి వినతిపత్రం అందజేశారు. నివాసాలు కలిగి ఉన్నవారికి, పొజిషన్లో ఉన్న వారికి విద్యుత్ కనెక్షన్లు ఇచ్చే విషయంలో డబల్ డిపాజిట్లు కట్టాలని, కఠిన నిబంధనలు చెప్పి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ కనెక్షన్లు ఇచ్చే విషయంలో బడుగు బలహీన వర్గాల వారికి ఇబ్బంది లేకుండా చూడాలని, నిబంధనలను సులభతరం చేయాలని, ఆస్తి పన్ను విధించే విషయంలో ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు.

ఏలూరు రూరల్‌లో వరి నాట్లు పూర్తి

- మండలంలో 6,500 ఎకరాల్లో వరిసాగు
- కృష్ణా కెనాల్ నీటి మట్టం పెంచాలని రైతుల డిమాండ్



కొమడవోలులో వరి చేలు



మాదేపల్లి పరిసరాల్లో పూర్తయిన నాట్లు

ఏలూరు రూరల్: ఏలూరు రూరల్ మండల గ్రామాల్లో చొదిమెళ్ల, వెంకటాపురం, మల్కాపురం, కొమడవోలు, మాదేపల్లి, పోణంగి, శనివారపుపేట, సత్రంపాడు, చాటపర్రు, కోటేశ్వరదుర్గాపురం, జాలిపూడి, బాబూఖాన్‌గూడెం, కాట్లంపూడి గ్రామాల్లో 100 శాతం నాట్లు పూర్తి అయ్యాయి. రెండువారాల క్రితం విస్తారంగా కురిసిన వర్షాలకు సాగుదారులు ఉత్సాహంగా నాట్లు వేశారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో సుమారు 6,500 ఎకరాల్లో రైతన్నలు నాట్లు వేశారని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. ఏలూరు రూరల్ మండల గ్రామాలు కృష్ణా, గోదావరి కాలువకు శివారున ఉన్నాయి. దీనివల్ల ఇతర ప్రాంతాల కన్నా సుమారు 40 రోజులు ఆలస్యంగా సాగు పనులు నిర్వహిస్తున్న విషయం విదితమే.

ఆదుకున్న వర్షాలు

ఈ ఏడాది వర్షాలు రైతుల్లో ఆశలను చిగురింపజేశాయి. వాస్తవానికి జూలై నెలాఖరి వారంలో సైతం ఆశించిన మేరకు వర్షాలు కురవకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. దీనివల్ల పలు గ్రామాల్లో రైతులు ఆకుమడి సైతం ఆలస్యంగా చేపట్టారు. అనంతరం కృష్ణ, గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు కాలువల ద్వారా నీరు చేరడంతో రైతుల్లో ఖరీఫ్‌పై పూర్తి నమ్మకాన్ని పెంచుకున్నారు. ఇదే క్రమంలో తమ్మిలేరు గూండా వరదనీరు రావడంతో పోణంగి ప్రాంతాల్లో 1500 ఎకరాల్లో రైతులు సాగు ముమ్మరం చేశారు.

శివారు ప్రాంతాలకు చేరని నీరు

రెండు రోజులుగా కృష్ణా కెనాల్ నుంచి సరిపడా సాగునీరు కిందకు విడుదల కావడం లేదు. దీంతో అప్పుడే రైతులు ఆందోళన మొదలైంది. కెనాల్‌లో ఉన్న నీరు ముందుగా పాండురంగా థియోటర్ స్లూయిజ్ నుంచి మాదేపల్లి, జాలిపూడి గ్రామాలకు నీరు చేరుతుంది. దిగువన ఉన్న బావిశెట్టివారిపేట స్లూయిజ్ కింద కొమడవోలు, చాటపర్రు పంట భూములకు నీరు సరపడా అందడం లేదు. ఈ ప్రాంతాల్లో చేలల్లో నీరు అప్పుడే ఇంకిపోతోంది. దీంతో రైతులు వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. కృష్ణా కెనాల్ నీటి మట్టం పెంచాలని కోరుతున్నారు. లేదంటే నారు ఎండిపోతుందని ఆందోళన చెందుతున్నారు.

విత్తనాలు అందించాం



మరో రెండురోజుల్లో కొమడవోలు, చాటపర్రు పరిసరాల్లో పంటచేలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందిస్తాం. ఖరీఫ్ సాగు కోసం రైతులకు 234 క్వింటాలు విత్తనాలు పంపిణీ చేశాం. కేజీ విత్తనాలకు రూ.5లు చొప్పున ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చింది. దీనివల్ల రైతులకు సుమారు రూ.1.15 లక్షలు లబ్ధి పొందారు. మల్కాపురం, చొదిమెళ్ల బోరునీటితో నాట్లు వేసిన పొలాల్లో ఈ క్రాఫ్ ప్రాంభించాం. ఇప్పటి వరకు సుమారు 650 ఎకరాల ఈ క్రాఫ్ చేశాం.

– జీవనసంధ్య, ఎంఏఓ

సంతోషిమాతకు పూజలు



సంతోషిమాతను దర్శించుకుంటున్న భక్తులు

ఏలూరు రూరల్ : రాఖీ పౌర్ణమి సందర్భంగా సోమవారం కొల్లేరు గ్రామం మొండికోడు శ్రీసంతోషిమాత అలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రాఖీపౌర్ణమి అమ్మవారి పుట్టినరోజు కావడంతో గుడివాకలంక, ప్రత్తికోళ్లలంక తదితర గ్రామాల నుంచి భక్తులు కాలినడకన వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, ఆలయ కమిటీ సభ్యులు ఆలయం వద్ద భారీ టెంట్లు వేయించారు. భక్తులకు అన్న సమారాధన ఏర్పాటుచేశారు. వేలం పాటలో అమ్మవారికి సమర్పించిన చీరలను భక్తులు సొంతం చేసుకున్నారు.

లక్ష్మీ హోమం నిర్వహిస్తున్న అర్చకుడు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): శ్రావణ పౌర్ణమి పర్వదినం సందర్భంగా ఆలయాల్లో సోమవారం విశేష పూజలు చేశారు. సత్రంపాడు సౌభాగ్యలక్ష్మికి పంచామృత అభిషేకం, విశేష కుంకుమ పూజలు చేశారు. పవర్‌పేటలోని శ్రీ కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తంగెళ్లమూడి షిర్డీ సాయి సేవా మందిర్‌లో వాసా ప్రసాదరావు ఆధ్వర్యం శ్రావణ పౌర్ణమి మందిర వార్షికోత్సవాలు వైభవంగా నిర్వహించారు.

కోల్‌కతా ఘటనపై నిరసన ప్రదర్శన



ఏలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు, న్యాయవాదులు



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఇఫ్టూ నాయకులు

ఏలూరు టౌన్: కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ వైద్య కళాశాలలో పీజీ ట్రైనీ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనలో దోషులను అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని ఏలూరు జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి అన్నారు. ఏలూరులో సోమవారం రాత్రి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ఏలూరు బార్ అసోసియేషన్, న్యాయవాదులు సంయుక్త ఆధ్వర్యంలో నగరంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఏలూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ భవనం నుంచి కోర్టుసెంటర్ మీదుగా ఫైర్‌స్టేషన్ సెంటర్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ రోజురోజుకూ సమాజంలో మహిళలు, యువతులు, బాలికలపై అఘాయిత్యాలు పెరిగిపోవటం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. పీజీ ట్రైనీ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి నిందితులకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లో కఠిన శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వైద్యులకు రక్షణ కల్పిస్తూ ప్రత్యేకంగా చట్టాన్ని తీసుకురావాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి కేబీ సీతారాం, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కే వరప్రసాదరావు, ఏలూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనేరు సీతారాం, భీమవరం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏలేటి న్యూటన్, జిల్లా లైన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ యార్లగడ్డ జగన్ మోహన్‌రావు, డాక్టర్ బసవరాజు, హ్యూమన్ రైట్స్ నాయకులు కట్టా సత్యనారాయణ, డాక్టర్ జి.స్పందన, న్యాయవాదులు, నర్సింగ్ విద్యార్థినులు ఉన్నారు.

వైద్యురాలి కుటుంబానికి న్యాయం చేయాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వైద్యవిద్యార్థిని మౌమితపై జరిగిన హత్యాచారం ఘటనపై విచారణ చేసి, ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని ఇఫ్టూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, ఏలూరు నగర జాయింట్ సెక్రెటరీ ముంగం అప్పారావు డిమాండ్ చేశారు. ఇఫ్టూ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక వైఎంహెచ్ఏ హాలు వద్ద నుంచి మెయిన్ బజార్ మీదుగా పాత బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ మౌమిత కుటుంబానికి కేంద్రం ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, డిమాండ్ చేశారు. పల్లి గంగరాజు, పాతాళం అప్పారావు, వలపు శ్రీనివాసరావు, పూడి రాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై సవతి తల్లి ప్రేమ తగదు



డీఈఓ అబ్రహాంకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఉపాధ్యాయులపై సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని ఏపీటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ అబ్రహాంను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. విదాశాఖ మంత్రి 117 జీఓను రద్దు చేసి 3, 4, 5 తరగతులను విలీనం చేసి ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేస్తానని బహిరంగ లేఖ రాసి, ఇప్పుడు అటువంటి చర్యలు ఏమీ తీసుకోకుండా సర్దుబాటు చేయడం బాధాకరమని పేర్కొన్నారు. ఐదేళ్లుగా మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించలేదని, ప్రధానోపాధ్యాయ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగానే ఉండిపోయాయని వివరించారు. వాటిని భర్తీ చేయకుండా ఏలూరు మండల విద్యాశాఖాధికారి జిల్లా పరిషత్ ఉపాధ్యాయులతో కలిపి కామన్ సీనియారిటీ జాబితా తయారు చేసి మున్సిపల్ ఉపాధ్యాయులను సుదూర ప్రాంతాలకు పంపాలని చూస్తున్నారని ఆరోపించారు. జీఓ 117 కారణంగా ఉన్నత పాఠశాలల్లో పనిభారం ఎక్కువగా ఉన్నందున ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఎస్‌జీటీలను కొనసాగించేలా, అర్బన్, రూరల్ ప్రాంతాలకు వేరువేరుగా జాబితాలు తయారు చేయాలని కోరారు. సీబీఎస్ఈ, ప్లస్ టూ పాఠశాలలకు సర్దుబాటు నుంచి మినహాయింపు ఇవ్వాలని, ఎన్‌సీసీ విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా ఎన్‌సీసీ పాఠశాలలను కూడా దీని నుంచి మినహాయించాలని కోరారు. డీఈఓను కలిసిన వారిలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రామారావు, నగర అధ్యక్షుడు కురమ ఆనందకుమార్, ప్రధాన కార్యదర్శి అబ్బుదాసరి శ్రీనివాస్, పాధ్యక్షుడు కొక్కిరపాటి పొట్టయ్య ఉన్నారు.

పని సర్దుబాటులో లోపాలు సవరించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియలో లోపాలను సవరించాలని కోరుతూ పీఆర్‌టీయూ నాయకులు సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ అబ్రహాంకు వినతి పత్రం అందించారు. మిగులు ఉపాధ్యాయుల జాబితా, ఖాళీల జాబితాల్లోని లోపాలను సరిచేసి మాత్రమే కౌన్సిలింగ్ నిర్వహించాలని కోరారు. స్కూల్ అసిస్టెంట్ ఖాళీలను నింపే క్రమంలో ఎస్‌జీటీల ఇష్టాన్ని పరిగణలోకి తీసుకుని, ఆయా ఖాళీలను భర్తీ చేయాలని, స్కూల్ అసిస్టెంట్స్, సెకండరీ గ్రేడ్ టీచర్ల కౌన్సెలింగ్‌ను సమాంతరంగా నిర్వహిస్తూ వారికి నచ్చిన ఆప్షన్ ఎంచుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో జరిగిన కౌన్సిలింగ్ అనంతరం మిగిలిపోయిన ఉపాధ్యాయులను పాఠశాల రోల్ అవరోహణ క్రమంలో సర్దుబాటు చేయాలని, ఈ ప్రక్రియలోని సందేహాల నివృత్తికి డీఈఓ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పువ్వుల ఆంజనేయులు, కేవీవీ సుబ్బారావు, ఎస్‌డీ మురసలీన్ ఉన్నారు.

వీఎస్ఎస్ భూములపై హక్కులు కల్పించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): 28 ఏళ్లుగా వనసంరక్షణ సమితిల్లో బంజరు భూముల అభివృద్ధికి పాటు పడుతున్న పేదలకు ఆ భూములపై హక్కు కల్పించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బండి వెంకటేశ్వరరావు, కుంచే వసంతరావు, జిల్లా నాయకులు బోడ వజ్రం ఒక ప్రకటనలో కోరారు. సీఎం చంద్రబాబు నాయుడు 28 సంవత్సరాల క్రితం అడవి బంజర్ల కోసం పేదలు ఉద్యమాలు చేయనవసరం లేదని, సాగు చేసుకోవాలని పిలుపునిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఏలూరు జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు సుమారు 260కు పైబడి వన సంరక్షణ సమితులను ఫారెస్ట్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి పేదలకు వీఎస్ఎస్‌లో భాగస్వామ్యం కల్పించారని వివరించారు. 1996లో చింతలపూడి మండలం నామవరంలో వన చంద్రోదయం పేరిట సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులతో ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వీఎస్ఎస్ సభ్యులకు కేటాయించిన భూములపై హక్కు కల్పించాలని కోరారు. వేలాది ఎకరాలు అడవి బంజరు భూములను వన సంరక్షణ సమితులకు కేటాయించి పేదలకు భాగస్వామ్యం కల్పించాలని పేర్కొన్నారు.

దూరవిద్యతో బంగారు భవిష్యత్ నిర్మాణం



వాల్‌పోస్టర్ విడుదల చేసిన కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో దూరవిద్యా విధానంలో నిర్వహిస్తున్న 10వ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులతో బంగారు భవిష్యత్ నిర్మించుకోవచ్చని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో సోమవారం వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ కె.వెట్రిసెల్వి విడుదల చేశారు. ఈ ప్రత్యేక దూర విద్యావిధానంలో నిర్వహిస్తున్న కోర్సులకు ఇంటర్ నెట్, ఏపీ ఆన్‌లైన్, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రవేశం పొందే అవకాశం ఉందని చెప్పారు. ఓపెన్ స్కూల్లోని పదోతరగతి, ఇంటర్మీడియేట్ కోర్సుల్లో నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. వివరాలకు డీఈఓ, డీవీఈఓ, ఆర్ఐఓ, డిప్యూటీ ఈఓ, ఎంఈఓ, లేదా సమీపంలోని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, ఉన్నతపాఠశాల హెడ్మాష్టార్‌లను లేదా హెల్ప్ లైన్ 0863 2239151లో సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జేసీ పి.ధాత్రిరెడ్డి, డీఆర్ఓ డి.పుష్పమణి, డీఈఓ ఎస్ అబ్రహాం, డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం. ముక్కంటి, కె.భాస్కర్ పాల్గొన్నారు.

ఫ్రీ హోల్డ్ భూములపై విచారణకు డిమాండ్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఫ్రీ హోల్డ్ భూములపై దళితులు, పేదలకు హక్కు కల్పించాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. సెప్టెంబర్ మొదటి వారంలో రాష్ట్ర వ్యాప్తంగా 'మీ భూమి – మీ హక్కు' పేరుతో నిర్వహించనున్న రెవెన్యూ గ్రామ సభల్లో ఫ్రీ హోల్డ్ భూములపై విచారణ చేయించాలని, అన్యాక్రాంతమైన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని దళితులు, పేదలకు పంచాలని పేర్కొన్నారు. ఏలూరు జిల్లాలో పాత చింతలపూడి, నూజివీడు, జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజన్ పరిధిల్లో ఉన్న వేలాది ఎకరాల అసైన్డ్, సీలింగ్ భూములు పేదలకు పంచాలని కోరారు. అసైన్డ్ భూములపై సీపీఎం పోరాడుతుందన్నారు.

ఉత్సాహంగా రక్ష బంధన్



సోదరునికి రాఖీ కట్టి హారతిచ్చి ఆశీర్వదిస్తున్న చిన్నారి



జెడ్పీ సీఈఓకు రాఖీకడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలో రక్ష బంధన్ వేడుకలు అత్యంత ఉత్సాహ భరితంగా జరిగాయి. అక్కలు, చెల్లెళ్లు తమ సోదరులకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. ఈ రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని నగరంలోని తమ సోదరులకు రాఖీలు కట్టడానికి ఇతర ప్రాంతాల్లో నివశిస్తున్న అక్క చెల్లెళ్లు నగరానికి రావడంతో పండుగ వాతావరణం నెలకొంది. ఉదయం పలు దుకాణాల వద్ద యువతులు రాఖీలు కొనుగోలు చేస్తూ సందడి చేశారు. ఎమ్మెల్యే బడేటి చంటికి బహుజన ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవరకొండ లలిత తదితర మహిళా ఉద్యోగులు రాఖీ కట్టి మిఠాయిలు తినిపించారు.

జెడ్పీలో రాఖీ వేడుకలు

ఏలూరు (మెట్రో): రాఖీ పౌర్ణమి సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ జెడ్పీ సీఈఓ కేఎస్ఎస్ సుబ్బారావుకు, కార్యనిర్వాహక ఇంజినీరు, పంచాయతీరాజ్ డివిజన్ రమణమూర్తికి రాఖీ కట్టారు. శుభాకాంక్షలు తెలిపారు.

దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి



జేసీ ధాత్రి రెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న సీపీఎం, సీపీఐ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరులో మహిళపై అత్యాచార యత్నం ఘటనలో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితురాలికి ఉపాధి కల్పించి ఆదుకోవాలని సీపీఎం, సీపీఐ నాయకులు జిల్లా జాయింట్ కలెక్టర్, ఎస్పీలకు సోమవారం వినతిపత్రాలను అందజేశారు. ఏలూరులో గతంలో కూడా మద్యం సేవించి మహిళలు, చిన్నారులపై ఇటువంటి దాడులకు పాల్పడిన ఘటనలు ఉన్నాయని పేర్కొన్నారు. ఏలూరులో జరిగిన ఘటనలో రాత్రి సమయంలో మహిళ కేకలు విని సినిమా చూసి అటువైపు వెళుతున్న ఒక యువకుడు మొదట డయల్ 100కు ఫోన్ చేశాడని, అది పని చేయలేదని అనంతరం ఏలూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సమాచారం అందించాడని తెలిపారు. దీనిపై పూర్తి దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో మహిళలపై ఇటువంటి అఘాయిత్యాలు జరగకుండా కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. మహిళలు, చిన్నారులపై అత్యాచార ఘటనలను అరికట్టడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా సినిమాల్లో అశ్లీలత, హింసను నిరోధించాలని ఇంటర్నెట్‌లో పోర్న్ వీడియోలు నిషేధించాలని కోరారు. అత్యాచారయత్నానికి పాల్పడిన దోషుల కేసు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా త్వరితగతిన విచారణ చేపట్టి దోషులకు కఠిన శిక్ష పడే విధంగా చూడాలని పేర్కొన్నారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించి, కుటుంబాన్ని ఆదుకోవడానికి ఆమెకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఏలూరు నగరంలో రాత్రిపూట పోలీసులు గస్తీ పెంచాలని కోరారు. మద్యం, డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలను అరికట్టాలన్నారు. టోల్ ఫ్రీ నెంబర్ 100 పనిచేయకపోవడం, పోలీసు నిర్లక్ష్యం తదితర వార్తలపై దర్యాప్తు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సీపీఎం నగర కార్యదర్శి పి.కిషోర్, సీపీఐ నగర కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, సీపీఎం నగర కమిటీ సభ్యులు వీవీవీఎస్ ప్రసాద్, సీపీఐ మహిళ సమాఖ్య నాయకులు ఎ.లక్ష్మీ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు చట్టం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న యామిని

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మహిళలపై అకృత్యాలకు, హత్యలకు పాల్పడకుండా కేంద్ర ప్రభుత్వం పటిష్టమైన చట్టం తీసుకురావాలని మహిళా సమాఖ్య ఐక్యవేదిక డిమాండ్ చేసింది. సోమవారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవన్లో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలపై జరుగుతున్న దాడులు, హత్యలు, అత్యాచారాలను నియంత్రించాలని కోరుతూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ యామిని మాట్లాడుతూ ఇటీవల కోల్‌కతా ఆర్‌జీ కార్ వైద్య కళాశాలలో పీజీ విద్య అభ్యసిస్తున్న విద్యార్థిని ప్రభుత్వ ఆసుపత్రిలో విధుల్లో ఉండి సమావేశ మందిరంలో సేద తీరుతున్న సమయంలో కొందరు దుర్మార్గులు హత్యాచారం చేశారని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని, పార్లమెంటులో మహిళల రక్షణ కోసం పటిష్టమైన చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరక శ్యామల, సభ్యురాలు బండి తులసి ఆశ, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, ఐహెచ్ఆర్‌సీ జిల్లా కార్యదర్శి ఎం శిరీష, జి.సరస్వతి, వైజ్ డైరెక్టర్ ఎన్ లక్ష్మీ కుమారి, స్త్రీ విముక్తి సంఘటన జిల్లా అధ్యక్షురాలు టి.చిన్ని, జనసేన నుండి సీహెచ్. నిఖిత పాల్గొన్నారు.

జంతువులను తరలిస్తున్న వ్యక్తుల అరెస్టు

పెదపాడు: విజయనగరం జిల్లా మానవరం నుంచి తమిళనాడులోని పాలాచికి 30 ఎద్దులను లారీలో తలిస్తుండగా.. కలపర్రు టోల్‌గేట్ వద్ద లారీని అడ్డుకుని ఎద్దులను గో సంరక్షణ శాలకు తరలించినట్టు ఎస్సై శుభశేఖర్ తెలిపారు.